క్లుప్తంగా


బంక్‌పై విరిగిపడిన చెట్టు కొమ్మ



బంకుపై విరిగిపడిన చెట్టు కొమ్మ

వెలుగోడు: వేల్పనూరు గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున ఈదురు గాలులకు చెట్లు విరిగిపడ్డాయి. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో గడ్డ కింది వెంకటేశ్వర్లు ఏర్పాటు చేసుకున్న బంకుపై చెట్టు కొమ్మ విరిగిపడటంతో అందులోని వస్తువులు ధ్వంసమయ్యాయని బాధితుడు వాపోయాడు. వీఆర్‌ఓ రమణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించాలని వెంకటేశ్వర్లు కోరారు.

మల్లన్నకు నృత్యనీరాజనం



నృత్యప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై నిజామాబాద్‌కు చెందిన అందెల రవళి నాట్యాలయం వారిచే సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. శివపంచాక్షరి, శివాష్టకం, భ్రమరాంబికాష్టకం తదితర గీతాలకు బి.సాయి రవళి సుకన్య, అభిలాష, మహతి, ఎస్.ప్రభ, లక్ష్మీప్రసన్న, అశ్లేష, వేద, సహస్ర, వర్షశ్రీ, జీవిక, మర్షిత తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

సంగమేశ్వరానికి భక్తుల తాకిడి



సంగమేశ్వరాలయంలో వేపదారు శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: శ్రీశైలం జలాశయంలో పూర్తిగా నీటిమట్టం తగ్గడంతో మండలంలోని సప్తనదుల సంఘమ ప్రాంతంలో వెలసిన ప్రాచీన సంగమేశ్వరాలయం పూర్తిగా బయపడింది. వేసవి ఆరంభం కావడంతో సంగమేశ్వరానికి భక్తుల తాకిడి రోజురోజుకు ఎక్కువవుతోంది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు, సందర్శకులు సంగమేశ్వరాలయాన్ని చేరుకుని వేపదారు శివలింగానికి ప్రత్యేక పూజలు చేస్తున్నా రు. సప్తనదుల సంగమ ప్రాంతాన్ని, కృష్ణానది పరవళ్లను, నల్లమల ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ఆనంద పరవశమవుతున్నారు.

బీజేపీ నాయకుల సహపంక్తి భోజనం



సహపంక్తి భోజనం చేస్తున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి

పగిడ్యాల: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని కొత్త ముచ్చుమర్రిలో శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి క్రైస్తవులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆమె మాట్లాడుతూ క్రైస్తవులు పవిత్రంగా ఆచరిస్తున్న గుడ్‌ఫ్రైడే రోజునే బీజేపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం కాలనీలో వైద్య శిబిరం నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండెపోగు చిన్నసుంకన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి సురేష్, బీజేవైఎం మండల అధ్యక్షులు నాగస్వామి ఉన్నారు.

వ్యక్తికి గాయాలు



గాయపడిన రంగస్వామి

పగిడ్యాల: నందికొట్కూరు- పగిడ్యాల మార్గమధ్యంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడు. పగిడ్యాల గ్రామానికి చెందిన బోయ రంగస్వామి ఉదయం తర్తూరు జాతరకు బైక్‌పై వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యంలో కొత్త రైస్ మిల్ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర రక్త గాయం అయ్యింది. బాధితున్ని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

10న రాష్ట్రస్థాయి ఎద్దుల పోటీలు

నంద్యాల(రూరల్): గుడ్‌ఫ్రైడే-ఈస్టర్ పండుగ పురస్కరించుకొని ఈనెల 10వ తేదీన మండలంలోని చాబోలు గ్రామంలో రాష్ట్రస్థాయి ఎద్దుల పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రైస్తవ సంఘ పెద్దలు శుక్రవారం తెలిపారు. గెలుపొందిన వృషభాలకు వరుసగా.. రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు దాతల సహకారంతో అందజేస్తామన్నారు. అలాగే.. అదే రోజు సాయంత్రం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు కూడా ఉంటాయని చెప్పారు. 9న ఇసుక బస్తా మోసే పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశామని వివరించారు.

జగనన్నే మా భవిష్యత్

● శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



మాట్లాడుతున్న శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

వెలుగోడు: అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మన భవిష్యత్ అని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు- మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వెలుగోడు పట్టణంలో ఎమ్మెల్యే శిల్పా పర్యటించారు. అంతకుముందు వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ కరోనాతో ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏ ఒక్క సంక్షేమ పథకాన్నీ ఆపలేదన్నారు. 46 నెలల్లో సంక్షేమ పథకాల ద్వారా పేదల ఖాతాల్లో రూ.2 లక్షల కోట్లు జమ చేశారన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలను ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నారన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ఇళ్ల వద్దకే పాలన తీసుకొచ్చారన్నారు. పాలనా సౌలభ్యం కోసం 13 జిల్లాలను 26 జిల్లాలుగా పునర్వ్యవస్థీకరించారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల సాధికారతకు చేయూతనిస్తూ 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ ప్రజ లు నినదిస్తున్నారన్నారు. ప్రజల్లో నుంచి వచ్చిన ఈ నినాదాన్నే కార్యక్రమంగా చేపడుతున్నామ న్నారు. మన పిల్లల భవిష్యత్ కోసం మనం మళ్లీ జగన్ననే ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలన్నారు. అనంతరం పొట్టి శ్రీరాములు సెంటర్‌లో పలు గృహాలను సందర్శించి వారి అనుమతితో జగనన్నే మా నమ్మకం స్టిక్కర్లను అతికించారు. ప్రతి ఒక్కరూ ఎమ్మెల్యేను, పార్టీ శ్రేణులను, గృహ సారథుల ను సాదరంగా ఆహ్వానించి తమ ఇళ్లకు స్టిక్కర్లు అంటించుకున్నారు. మళ్లీ



స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

జగనన్నే ముఖ్యమంత్రి కావాలంటూ ప్రజలు సమ్మతిని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్‌ఖాన్‌స్ జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమా, నాయకులు దేశం తిరుపంరెడ్డి, అమీర్ అలీఖాన్, కే.రామ్మోహన్‌రెడ్డి, గోవిందు, తెలుగు రమణ, ముంతల విజయభాస్కర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి, ఎం. సుధాకర్‌రెడ్డి, బోయరేవుల రమణ, శ్రీనివాసులు, పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని పరమటూరు సహకార సంఘం చైర్మన్ శివలింగం, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం పెద్దదేవళాపురం, సంతజూటూరు, ఈర్నపాడు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ న్యాయం చేశారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు ప్రజల ముంగిటకే తెచ్చారన్నారు.

మహానంది: సంక్షేమ పథకాలను కాలెండర్‌గా తయారు చేసుకుని, మేనిఫేస్టోను పవిత్ర గ్రంథంగా భావించి ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్న సీఎం జగన్ నిజమైన సంక్షేమరాజ్యాన్ని స్థాపిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు కేవీఆర్ మహేశ్వర్‌రెడ్డి, మండల కన్వీనర్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి అన్నారు. తమ్మడపల్లె గ్రామంలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుక్కాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కందుల రఘురామిరెడ్డి, కుంచపు శ్రీనివాసులు ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికి తిరిగి ప్రజలకు సంక్షేమ పథకాలు వివరించారు. కార్యక్రమంలో ఈశ్వరస్వామి ఆలయ చైర్మన్ యర్రగుంట్ల రాముడు, మాజీ ఉపసర్పంచ్ శివయ్య, భీమవరం నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఇంటి తలుపు తట్టండి

ఆత్మకూరు: ప్రతి ఇంటి తలుపు తట్టి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీయాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20వ తేదీ వరకు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ఈ నాలుగేళ్లలో ప్రభుత్వ చేసిన మంచిని తెలియజేయాలన్నారు. వారి ఇళ్లకు ముఖ్యమంత్రి ఫొటో ఉన్న స్టిక్కర్లను అతికించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే నోట్ చేసుకుని, తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీర్, నియోజకవర్గ పరిశీలకులు సురేందర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జనం గుండెల్లోంచి వచ్చిందే 'మా నమ్మకం నువ్వే జగన్'



ప్రజల అభిప్రాయం సేకరిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

● నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: ఇచ్చిన మాట తప్పడనే నమ్మకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పరుచుకున్నారని నందికొట్కూర్ ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలో ఎమ్మెల్యే పర్యటించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో 96 శాతం నెరవేర్చి ప్రతి ఇక్కరి గుండెల్లో జగనన్న నమ్మకం సంపాదించుకున్నారన్నారు. ప్రజల్లో నుంచి వచ్చిన నినాదమే కార్యక్రమానికి పేరు పెట్టామన్నారు. ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించి మరోసారి ముఖ్యంత్రిని చేసుకోవాల్సిన అవసరాన్ని తెలియజేస్తామన్నారు. అనంతరం 18వ వార్డులో ఇంటింటికి తిరిగి ప్రజలను పలకరించారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగోలేకపోయినా సంక్షేమ పథకాలు ఆపకుండా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు వేసిన విషయాన్ని గుర్తు చేశారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నే మన అందరి భవిష్యత్ అన్నారు. ఆయన అందరి దీవెనలు అవసరమన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, టౌన్ సీఐ విజయభాస్కర్, సింగిల్ విండో చైర్మన్లు హుసేనయ్య, హరి సర్వోత్తమరెడ్డి, కౌన్సిలర్లు సుమలత, జాకీర్ హుసేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ వనజ, వెంకటరెడ్డి, విక్టర్, ఆర్ట్ శ్రీను, గోవర్ధన్‌రెడ్డి, భాస్కర రెడ్డి, వెంకటేష్, ప్రవీణ్, శంకరయ్య పాల్గొన్నారు.

● పాములపాడు: జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు చౌడయ్య, జేసీఎస్ ఇన్‌చార్జ్ రమణారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమానికి సంబంధించిన కిట్లు, కర పత్రాలు నాయకులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర కార్పొ రేషన్ డైరెక్టర్ రామసుబ్బయ్య, కో ఆప్టెడ్ సభ్యుడు ముర్తుజావలి, పార్టీ నాయకులు రాములమ్మ, పీరయ్య, శివలింగం, షేక్షావలి, నరసింహులు, దరగయ్య, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్యకు దరఖాస్తు చేసుకోండి

కొత్తపల్లి: 18 ఏళ్లలోపు బాల, బాలికలు మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కొత్తపల్లి సెక్టార్ ఐసీడీఎస్ సూపర్ వైజర్ కోమల, దుద్యాల సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దేవజయమ్మ శుక్రవారం తెలిపారు. 18 ఏళ్లలోపు అనాథ బాల, బాలికలకు(తల్లి/తండ్రి మృతిచెందిన, తల్లిదండ్రులు విడాకులతో విడిపోయి, ప్రాణాంతక వ్యాధి బారిన పడిన బాల, బాలికలకు) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త పథకమైన మిషన్ వాత్సల్య ద్వారా నెల రూ.4 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వీరితో పాటు బాలల న్యాయ ఆదరణ, సంరక్షణ చట్టం-2015 ప్రకారం ఇల్లు లేని పిల్లలకు, ప్రకృతి వైపరీత్యానికి గురైన బాలల, బాల కార్మికులు, అక్రమ రవాణాకు గురైన పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈనెల 15లోపు వారి పూర్తి వివరాలతో అంగన్వాడీ కేంద్రాలలో సంప్రదించాలన్నారు.

పూలే జయంతిని విజయవంతం చేద్దాం



ముసలిమడుగులో గ్రామస్తులతో మాట్లాడుతున్న కస్టమ్స్ అధికారి

కొత్తపలి: జ్యోతిరావు పూలే జయంతిని విజయవంతం చేయాలని కస్టమ్స్ అధికారి వేల్పుల ఆనంద్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పాత మాడుగుల, ఎర్రమఠం, ముసలమడుగు, గుమ్మడాపురం, సింగరాజుపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో దళిత, బహుజన సంఘాల ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11న మండల కొత్తపల్లిలో జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నామని, అధిక సంఖ్యలో దళిత బహుజన ప్రజలు తరలిరావాలని కోరారు. ఆయన వెంట సరస్వతి పాఠశాల కరస్పాండెంట్ మల్లయ్య, రాజరాజేశ్వరి పాఠశాల కరస్పాండెంట్ వాసుదేవరెడ్డి, యూత్ ఫర్ యాంటీ కరప్షన్ జిల్లా కార్యదర్శి బొల్లు ప్రసాద్ బాబు యాదవ్ ఉన్నారు.

సత్తా చాటిన కర్ణాటక ఎద్దులు



బండ లాగుతున్న వృషభాలు

జూపాడుబంగ్లా: తర్తూరు జాతర సందర్భంగా శుక్రవారం నిర్వహించిన న్యూకేటగిరి ఎద్దుల బండలాగుడు పోటీల్లో కర్ణాటక ఎద్దులు సత్తా చాటాయి. పోటీలను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పోచా జగదీశ్వరరెడ్డి, సర్పంచ్ పీఎం నాగిరెడ్డి తదితరులు మాట్లాడుతూ తర్తూరు జాతరకు రైతు జాతరగా పేరొందని, 20 ఏళ్ల క్రితం నెల రోజుల పాటు జరిగేదన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రైతుల ఆనందం కోసం ఎద్దుల పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ పోటీల్లో 9 జతల ఎద్దులు పోటీ పడగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఖాజాహుసేన్ ఎద్దులు మొదటిస్థానంలో నిలిచి రూ.80వేలు కైవసం చేసుకొన్నాయి. కానాలకు చెందిన గుండం చెన్నారెడ్డి ఎద్దులు ద్వితీయస్థానంలో నిలిచి రూ.60వేలు దక్కించుకొన్నాయి. జిల్లెల్లకు చెందిన గుడిక నాగిరెడ్డి ఎద్దులు తృతీయస్థానంలో నిలిచి రూ.40వేలు చేజిక్కించుకొన్నాయి. సంజామల మండలం, వనికెనదిన్నెకు చెందిన తలారి రామనాయుడు ఎద్దులు నాల్గొవస్థానంలో నిలిచి రూ.20వేలు కైవసం చేసుకొన్నాయి. ఇస్కాలకు చెందిన నాగార్జున ఎద్దులు ఐదొవస్థానంలో నిలిచి రూ.10వేలు దక్కించుకొన్నాయి. కె.బొల్లవరం గ్రామానికి చెందిన వెంకటకృష్ణ వృషభాలు ఆరోస్థానంలో నిలిచి రూ.5వేలు చేజిక్కించుకొన్నాయి. గెలుపొందిన వృషభాల ఎద్దులకు డాక్టర్ పరమేశ్వరరెడ్డి, శేరెడ్డినారాయణరెడ్డి, డాక్టర్ ఎస్‌కె.ఉరూఫ్‌రహంతుల్లా నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లింగాపురం సర్పంచ్ నాగార్జునరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తోకల కృష్ణారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి, నానిరెడ్డి, పీఎం మహేష్‌రెడ్డి, సుంకిరెడ్డి, కోసిక తిరుమలేశ్వరరెడ్డి, నరేష్‌కుమార్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, తరుణ్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నగదు బహుమతి అందజేస్తున్న నాయకులు

పల్లకీలో ఆదిదంపతుల విహారం

మహానంది: స్వయంభువుగా వెలిసిన మహానందీశ్వరస్వామి దంపతులు శుక్రవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఆలయ పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, అలంకార హారతులు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ హరినాథ్ పాల్గొన్నారు.

బహుజన రాజ్యాధికారం తెద్దాం

జూపాడుబంగ్లా: బహుజన రాజ్యాధికారం తెచ్చేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పోరాడాలని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ నాయకుడు ఎల్ స్వాములు తెలిపారు. శుక్రవారం ఆయన జూపాడుబంగ్లాలో బీఎస్‌పీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని బహుజనులంతా ఐక్యమత్యంతో పోరాడాలన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు.

10న 'గడప గడపకు మన ప్రభుత్వం'

మహానంది: సీతారామాపురం గ్రామంలో ఈ నెల 10న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం ఉంటుందన్నారు. అదేరోజు సచివాలయం, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవనాల ప్రారంభోత్సవం ఉంటుందని, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

యేసు మార్గం అనుసరణీయం







నందికొట్కూరు సీఎస్ఐ చర్చిలో ప్రసంగిస్తున్న రెవరెండ్ ఫాదర్ ప్రవీణ్‌కుమార్, ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు, మిడుతూరులో సిలువ మోస్తున్న ఫాదర్ శ్యామ్‌కుమార్

● ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

● భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు

నందికొట్కూరు: యేసు మార్గం అనుసరణీయమని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా క్రైస్తవులు శుక్రవారం గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. సీఎస్ఐ, ఏబీఎం, హోసన్న, ఆర్‌సీఎం, సీయోను తెలుగు బాప్టిస్టు చర్చి, తదితర ప్రార్థన మందిరాలు యేసు నామ స్మరణతో మారుమ్రోగాయి. పాస్టర్లు దైవ సందేశాన్ని వినిపించారు. వేకుజాము నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రార్థనలు చేశారు. ఆర్‌సీఎం చర్చి వద్ద ఎమ్మెల్యే ఆర్థర్ సిలువ మోశారు. ప్రేమ, త్యాగం, క్షమా గుణమే క్రీస్తు చూపిన జీవన మార్గమని ఎమ్మెల్యే అన్నారు. రెవరెండ్ ఫాదర్లు ప్రవీణ్‌కుమార్, వరప్రసాద్, సీఎస్ఐ టౌన్ చర్చి కార్యదర్శి అమల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

● జూపాడుబంగ్లా: పారుమంచాల, తాటిపాడు, జూపాడుబంగ్లా, మండ్లెం, తూడిచెర్ల, తర్తూరు, తరిగోపుల తదితర గ్రామాల్లో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చీల ఫాదర్లు మాట్లాడుతూ పాపులను రక్షించి వారిని విముక్తులను చేయటానికే యేసు సిలువ వేయబడినట్లు తెలిపారు.

● పగిడ్యాల: నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, పడమర వనములపాడు, పగిడ్యాల, లక్ష్మాపురం, పడమర ప్రాతకోట, ఎం.ఘణపురం తదితర గ్రామాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పగిడ్యాల దేవనగర్‌లోని ఏబీఎం సంఘ కాపరి రెవరెండ్ ఏ.యోహాన్ మాట్లాడుతూ యేసు జీవితం లోకానికి ఆదర్శనీయమన్నారు.

● పాములపాడు: దైవ సందేశంతో జాతికి శాంతి సందేశం ఇస్తూ యేసు క్రీస్తు శిలువ ఎక్కిన రోజును గుడ్‌ఫ్రైడేగా జరుపుకుంటామని బ్రదర్ సమ్సోన్‌ఎఫ్రా తెలిపారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని అన్ని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక బస్టాండ్ సెంటరులో బేతనియ సంఘస్తులు మజ్జిగ పంపిణీ చేశారు. సంఘం పెద్ద కల బండి ఆనంద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు.

● కొత్తపల్లి: గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని క్రైస్తవులు మండలంలోని ఆర్సీఎం, సీఎస్ఐ, సెవెంత్‌డే ఎడ్వంటిస్ట్ చర్చీలలో మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపవాస ప్రార్థనలు చేశారు. క్రీస్తు బోధనలను పాస్టర్లు, ఫాదర్లు వివరించారు. పలు గ్రామాల్లో సిలువతో ఊరేగింపు నిర్వహించారు.

● మిడుతూరు: మండలకేంద్రంతోపాటు మాసపేట, కలమందలపాడు, ఉప్పలదడియ, కడుమూరు, 49-బన్నూరు, చౌట్కూరు, చెరుకుచెర్ల, తలముడిపి, రోళ్లపాడు, ఆలగనూరు తదితర గ్రామాల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉప్పలదడియ ఆర్‌సీఎం చర్చి నుంచి కల్వరికొండ వరకు సిలువ యాత్ర నిర్వహించారు. గుడ్‌ఫ్రైడే విశిష్టతను ఫాదర్ శ్యామ్‌కుమార్ వివరించారు.



పాములపాడులో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం



కొత్తపల్లి: గువ్వలకుంట్ల గ్రామంలో సిలువ యాత్రను నిర్వహిస్తున్న క్రైస్తవులు

కరుణామయుడు యేసు



ఆత్మకూరులో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

శ్రీశైలంటెంపుల్: సమస్త మానవాళి పట్ల ప్రేమా, అప్యాయతలతో కరుణామయుడిగా యేసు వెలుగొందారని క్రైస్తవ మత పెద్దలు తెలిపారు. మండలంలోని సున్నిపెంట గ్రామంలో గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మేరిమాత ఆలయం, తెలుగు బాపిస్టు టౌన్ చర్చి, లూథరన్ చర్చి, సీఎస్ఐ, తెలుగు బాప్టిస్టు మెయిన్ చర్చి, బెతేస్త ప్రార్థనా మందిరం, ప్రేమామయుడు ప్రార్థనా మందిరం, పెంతుకోస్తు తదితర చర్చిలలో ఉదయం నుంచి క్రైస్తవులు ప్రత్యేక పాటలతో క్రీస్తును స్తుతించారు. మేరిమాత ఆలయం సంఘస్తులు యేసుక్రీస్తు శిలువ మోస్తూ పలికిన ఏడు మాటలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. శుభ శుక్రవారమును పురస్కరించుకుని అన్ని చర్చిలలో యేసుక్రీస్తు శిలువ మోసుకుంటూ పలికిన ఏడు మాటలను దైవజనులు భక్తులకు వివరించారు.

● ఆత్మకూరు: పట్టణంలోని ఇందిరానగర్, ఎస్‌పీజీ పాలెం, ఏబీయంపాలెం తదితర ప్రార్థనా మందిరాల్లో గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సీఎస్ఐ పాస్టర్ జాన్‌బాబు, ఎస్‌పీజీ పాలెం పాస్టర్ రాజేంద్రబాబు గుడ్‌ఫ్రైడే విశిష్టతను తెలిపారు.

● వెలుగోడు: యేసుక్రీస్తు త్యాగపూరిత మరణానికి కారణమైన రోజు కనుకే ఈ శుక్రవారం శుభకరమైందని బిలీవర్స్ ఈస్టన్ చర్చి జిల్లా ఇన్‌చార్జ్ పాదర్ రెవరెండ్ జీ.ఆనంద్‌బాబు తెలిపారు. గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో సిలువ ప్రదర్శన నిర్వహించారు.



వెలుగోడు పట్టణంలో సిలువ ప్రదర్శన



బండిఆత్మకూరులో..

సీఎస్ఐ, హోసన్నా, భక్తసింగ్ ఫెలోసిప్, పెంతకోస్తు, తెలుగు బాప్టిస్ట్ చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● బండిఆత్మకూరు: మండలంలో గుడ్‌ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రైస్తవులు సిలువను భుజంపై మోసుకుంటూ చర్చి వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● మహానంది: కరుణామయుడైన యేసు జీవితమే త్యాగానికి చిహ్నం, ఆ ప్రభువును శిలువ వేసిన రోజే గుడ్‌ఫ్రైడే రోజని చర్చి ఫాదర్లు రాజ్‌కుమార్, దేవప్రియము అన్నారు. గాజులపల్లె, బోయిలకుంట్ల మెట్ట వద్ద ఉన్న సత్యవేద ఆశ్రమంతో పాటు వివిధ గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



సున్నిపెంటలో సిలువ మోస్తున్న క్రైస్తవులు